## క్లుప్తంగా

### నేలకూలిన చెట్టు.. తొలగించని వైనం..



శాయంపేట : మండలంలోని మందారిపేట నుంచి పరకాలకు వెళ్లే జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టు గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు నేలకూలింది. వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు శుక్రవారం సాయంత్రం వరకు కూడా దాన్ని తొలగించలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టును తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహన దారులు, స్థానికులు కోరుతున్నారు.

### 'భట్టి' పాదయాత్ర రేపటికి వాయిదా

కమలాపూర్ : నేడు (శనివారం) కమలాపూర్ మండలంలో తలపెట్టిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర రేపటికి (ఆదివారం) వాయిదా పడ్డట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా పాదయాత్రను ఆదివారానికి వాయిదా వేశారని పేర్కొన్నారు. ఆదివారం పాదయాత్ర యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. మార్పును పార్టీ శ్రేణులు, మండల ప్రజలు గమనించాలని కోరారు.

### జీపీ గదులకు వేలం



ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న గదులకు వేలం ప్రక్రియ పూర్తి చేసినట్టు ఎంపీడీఓ, గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వేలం నిర్వహించగా మీడియాకు ఆయన వివరాలు వెల్లడించారు. వ్యాపారులు గ్రామ పంచాయతీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి యాదగిరి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అంకూస్, వార్డ్ సభ్యుడు పాదిల సదయ్య తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు



ఐనవోలు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని పెంపొందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రీడింగ్ విత్ లెర్నింగ్ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వం కథల, ఇతర పుస్తకాలు భద్రపరచడానికి ర్యాక్‌లు, విద్యార్థులు కూర్చోవడానికి కార్పెట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుకర్, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, బీమళ్ల సారయ్య పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్రీడా సామగ్రి బహూకరణ



కమలాపూర్ : మండలంలోని గూడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శ్రేయోభిలాషి ట్రస్ట్, మామిడిశెట్టి శేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.18 వేల విలువైన స్పోర్ట్స్ కిట్ బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.ప్రభావతి, సర్పంచ్ అంకతి సాంబయ్య, ఎంపీటీసీ పాక లక్ష్మి రవీందర్, ఎస్ఎంసీ చైర్మన్ కుట్ల స్వప్న, ట్రస్ట్ డైరెక్టర్ రవి, దాతలు న్యాయవాది బండి కళాధర్, పిల్లల వెంకన్న, సంగెన సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలను తొలగించాలి

ఎల్కతుర్తి : స్థానిక ఐబీపీ పెట్రోల్ పంప్ ఎదుట ఉన్న సర్వే నంబర్ 294లోని ప్రధాన రహదారి పక్కనే చేపట్టిన భవన అక్రమ నిర్మాణాలను తొలగించాలని దళిత సంఘాల నాయకులు శనిగరం వెంకటేష్, రేణుకుంట్ల సాంబయ్య అధికారులను కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన రెండు శట్టర్ల ఇంటిని కూల్చి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని అధికారులకు సూచించారు.

# అన్ని మతాలకు ప్రాధాన్యం

ఐనవోలు : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకూ ప్రాధాన్యం ఇస్తోందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో 200 మంది పేద ముస్లింలకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముస్లింలందరూ రంజాన్ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలిత యాదవ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ మజ్జిగ జైపాల్, తహసీల్దార్ రాజేష్, జెడ్పీ కోఆప్షన్ ఉస్మాన్ అలీ, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, గుంశావలీ, పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, మిద్దెపాక రవీందర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్బాస్ అలీ, చందర్‌రావు, బాబు, సమ్మయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు : ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే, ముస్లింలు

ఎల్కతుర్తి : రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు ప్రభుత్వం అందజేసిన కానుకలను మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రంజాన్ పండుగను పేద ముస్లింలు సైతం ఆనందంగా జరుపుకోవాలని కాంక్షిస్తూ ప్రభుత్వం నూతన దుస్తులను కానుకగా అందజేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీధర్, తూముల రంజిత్‌రెడ్డి, కమురొద్దీన్, రసూల్, సలీమ్, శేక్‌మధార్, ఎండీ నసూర్, అమ్జద్, నర్సింహులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : దుస్తులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

**కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో..**

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని మసీదులో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇఫ్తార్ విందు మత సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో యాసిన్, సలీం, సాదిక్, రహీమ్, హఫీజ్, ఫయాజ్, ముజ్జు, వసీం, జహీర్, బాబా పాల్గొన్నారు.



ధర్మసాగర్ : ప్రార్థన చేస్తున్న సర్పంచ్, ముస్లింలు

## గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలి



ఆత్మకూరు : వినతిపత్రం ఇస్తున్న నాయకులు



ఐనవోలులో..

ఆత్మకూరు : గొల్లకురుమలకు గొర్రెల పంపిణీకి బదులు బ్యాంకు వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు బదిలీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు నగరబోయిన సారంగం, శాతవేణి రమేష్ కోరారు. ఈ మేరకు వారు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని హనుమకొండలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్య, సారంగం, రమేష్ మాట్లాడారు. గొర్రెల పంపిణీ వల్ల కలిగే నష్టాలను, నగదు బదిలీ వల్ల ప్రయోజనాలను ఎమ్మెల్యేకు వివరించారు. నగదు బదిలీ చేసేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. నగదు బదిలీ అంశాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళతానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు పరికి మధుకర్, కాడబోయిన లింగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కావటి సారయ్య, చందు మల్లేష్ పాల్గొన్నారు.

**ఐనవోలు మండల కమిటీ ఆధ్వర్యంలో..**

ఐనవోలు : గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య మాట్లాడారు. నగదు బదిలీ చేయాలని, క్యాస్ట్ సర్టిఫికెట్ నిబంధన ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండి పర్వతాలు, ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, పిండి రమేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు దయాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



ఎల్కతుర్తి : మండలంలోని కేశవాపూర్ గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పొన్నాల వెంకటలక్ష్మీ ఎర్రగట్టు స్మారక సదనం తరఫున పొన్నాల రామయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వేసవి నేపథ్యంలో రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోందని చెప్పారు. గ్రామస్తుల, బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. చలివేంద్రం జూన్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు, బాటసారులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నాల అరుంధతి, తీగల కృష్ణస్వామి, చల్లా రాంరెడ్డి, అనసూర్య, విజయలక్ష్మి, హేమలత, పోలు సంపత్, రమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యం పెంచుకుంటేనే ఆర్థిక వృద్ధి

● డీపీఎం శ్రీకాంత్

కమలాపూర్ : మహిళలు ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నైపుణ్యం పెంచుకుంటేనే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించగలరని జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ అనుబంధ సంస్థల డీపీఎం శ్రీకాంత్ స్పష్టం చేశారు. మండలంలోని ఉప్పల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన జీవనోపాధి, వ్యాపార సంస్థల అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. మహిళలకు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో టమాట సాస్, చిల్లీ సాస్, చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ, మాంసం పచ్చళ్లకు మంచి గిరాకీ ఉందని చెప్పారు. శిక్షణలో భాగంగా మహిళలు మార్కెటింగ్ మెళకువలు, ఫుడ్ ప్రాసెసింగ్ లైసెన్స్, బ్రాండింగ్, ప్యాకేజింగ్ అంశాలు నేర్చుకోవాలని చెప్పారు. డీఆర్పీ సంతోష్ మాట్లాడుతూ కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోదల్చిన స్వశక్తి సంఘాల మహిళలకు పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా 35 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల వరకు రుణ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్వోదయ సంస్థ సిబ్బంది కవిరాజ్, ఇందిర, అక్తర్, తిరుమల, హైమ, శిక్షకురాలు సరోజన తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న మహిళలతో డీపీఎం

### స్నేహితుడి కుటుంబానికి రూ.లక్ష సాయం



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన మోటం కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆయన మిత్రులు శుక్రవారం రూ.లక్ష నగదు సాయం అందజేశారు. తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బాధిత కుటుంబీకులతోపాటు కుమారస్వామి మిత్రులు పాల్గొన్నారు.

### నివాళి



శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త రేణిగుంట్ల భిక్షపతి తండ్రి మల్లయ్య మృతదేహానికి జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా చైర్‌పర్సన్ జ్యోతి భిక్షపతిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, సర్పంచ్ వనమ్మ వీరస్వామి, ఎంపీటీసీ ఉమ రఘుసింగ్, వేణుగోపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'సంఘం'లో రూ.2.50 కోట్ల అవినీతి

● 'వాహన పూజ'లో చైర్మన్ శ్రీపతి రవీందర్

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ది విశాల సహకార సంఘంలో రూ.2.50 కోట్ల అవినీతి జరిగిందని సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ తెలిపారు. ఆ సంఘం మినరల్ కూల్ వాటర్ సప్లయ్ చేయడం కోసం కొనుగోలు చేసిన టాటా ఏస్ వాహనానికి శుక్రవారం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ రవీందర్‌గౌడ్ మాట్లాడారు. అవినీతి జరిగినట్టు అధికారులు నిర్ధారించిన క్రమంలోనే నిబంధనల మేరకు మాజీ చైర్మన్‌కు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. అవినీతికి పాల్పడకపోతే రైతుల సమక్షంలో నిజాయితీని నిరూపించుకోవాలని హితవు పలికారు. తమ పాలకవర్గం అధికారంలోకి రాకముందే రూ.2.50 కోట్ల అవినీతి బట్టబయలైందని చెప్పారు. ప్రస్తుతం అవినీతి ఆరోపణలపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. గత పాలకవర్గ సమయంలో సొసైటీలో బ్యాలెన్స్ జీరో ఉండగా ప్రస్తుతం రూ.1.30 కోట్లు డిపాజిట్ చేయించినట్టు చైర్మన్ వివరించారు. సొసైటీ ద్వారా శుభ కార్యాలు, ఇతర సందర్భాల్లో వాటర్ సప్లయ్ చేయడానికి వాహనం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మునిగడు శేషగిరి, సీఈఓ తిరుపతి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



వాహనానికి పూజ చేస్తున్న చైర్మన్ రవీందర్‌గౌడ్

### పరామర్శ



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు ముల్కనూరి వెంకటేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించారు. వెంకటేష్ తండ్రి వెంకటనర్సు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కీర్తిరెడ్డి కలిసి మాట్లాడారు. నగదు సాయం చేశారు. ఆమె వెంట దళిత మోర్చా మండల అధ్యక్షుడు మంద సురేష్, నాయకులు రాజమౌళి, తదితరులున్నారు.

### చెరువులో పడి వృద్ధుడి మృతి

శాయంపేట : బహిర్భూమికి వెళ్లిన వృద్ధుడు ప్రమాదశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని కాట్రపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు కథనం ప్రకారం.. కాట్రపల్లికి చెందిన రేణికుంట్ల మల్లయ్య (80) శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని గుంటి చెరువు సమీపంలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయాడు. చెరువు గట్టుపైన మల్లయ్య చెప్పులు, టవల్ కనిపించగా విషయం వెలుగులోకి వచ్చింది. మల్లయ్య కొడుకు భిక్షపతి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గ్రీన్‌వుడ్‌లో అలరించిన టాలెంట్ షో

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మ్యాథ్స్ ఫెయిర్, ఫుడ్ ఫెస్ట్, ఆర్ట్ గ్యాలరీ టాలెంట్ షోలు అలరించాయి. టాలెంట్ షో కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాఠశాల డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, జి.భరద్వాజ నాయుడు హాజరై ఎగ్జిబిట్లను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించేందుకు ఇలాంటి టాలెంట్ షోలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, సీఏఓ ప్రభుకుమార్, వైస్ ప్రిన్సిపాల్ మహేందర్, ఏసీఓలు శ్రీకాంత్, హర్షవర్ధన్, రుమానా, ఏఓ మురళి, హెచ్ఆర్ వాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

### ఉచిత వైద్యశిబిరం

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వీణా మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్, శ్రీరాం ఫౌండేషన్ చైర్మన్ గురిజాల శ్రీరాంరెడ్డి మాట్లాడారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని చెప్పారు. వైద్యశిబిరం ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.అశోక్, డాక్టర్ వి.రాజేష్, ఎంఈఓ రమాదేవి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, వార్డు సభ్యులు వేల్పుల రాజ్‌కుమార్, కె.శివకుమార్, రామనాథం తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



దామెర : చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



నడికూడ : చెక్కులు అందజేస్తున్న భిక్షపతి

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర : రైతుల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని పులుకుర్తిలో గతేడాది పంట నష్టపోయిన రైతులకు మంజూరైన పరిహారం చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గతేడాది వడగండ్ల వర్షానికి నియోజకవర్గంలో 6 వేల 43 మంది రైతులకు సంబంధించిన 6 వేల 322 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా రూ.3.30 కోట్లకుపైగా పరిహారం మంజూరు చేసినట్టు తెలిపారు. ఇటీవల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.151 కోట్లు విడుదల చేసిందన్నారు. వచ్చే వారం నుంచి రైతుల ఖాతాల్లో పరిహారం డబ్బులు జమకానున్నట్లు వివరించారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్ అలీ, తహసీల్దార్ రియాజుద్దీన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, సర్పంచ్ గోవిందు అశోక్, వార్డు సభ్యుడు పేరబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : గతేడాది వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలకు సంబంధించి మండలంలోని పులిగిల్ల, నార్లాపూర్, చౌటుపర్తి గ్రామాలకు చెందిన బాధిత రైతులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ సుధాటి వెంకన్న పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

## 25న ఆవిర్భావ వేడుకలు, సమ్మేళనం

ఆత్మకూరు : ఈనెల 25న పరకాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు, పరకాలలోని లలిత కన్వెన్షన్ హాలులో పార్టీ నియోజకవర్గస్థాయి సమ్మేళనం నిర్వహించనున్నట్టు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. నుమకొండలోని తన నివాసంలో ముఖ్యనాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని పల్లెల్లో ఉదయం 8 గంటలకే పార్టీ జెండా ఎగరేయాలని చెప్పారు. అలాగే నియోజకవర్గ స్థాయి సమావేశానికి గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకున్న నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని సూచించారు. సమావేశంలో పార్టీ ఆత్మకూరు, దామెర మండలాల అధ్యక్షులు లేతాకుల సంజీవరెడ్డి, గండు రాము, ఎంపీపీలు మార్క సుమలత రజనీకర్, కాగితాల శంకర్, జెడ్పీటీసీలు కల్పన, కక్కెర్ల రాధిక రాజు, దామెర వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, నాయకులు రవియాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఎల్కతుర్తి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు గుజ్జ శ్యామ్‌సుందర్‌రావు



నడికూడలో..

ఎల్కతుర్తి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని రైతు సేవా పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు గుజ్జ శ్యాంసుందర్‌రావు తెలిపారు. వరికోతలు మొదలై 15 రోజులు గడుస్తున్న సందర్భంగా మండలంలోని గోపాల్‌పూర్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ సైంటిస్ట్ ఎస్.వెంకటేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ మండల అధికారి (ఏఓ) రాజ్‌కుమార్‌లతో కలిసి శ్యాంసుందర్‌రావు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. కేవీకే సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వర్‌రావు, ఏఓ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు, సంఘం కార్యదర్శి రాజమౌళి, సెంటర్ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, ప్రశాంతి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

**భీమదేవరపల్లిలో...**

మండలంలోని మాణిక్యాపూర్‌లో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సుస్థిర వ్యవసాయం ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఉగ్గె శేఖర్, మాణిక్యాపూర్ సర్పంచ్ వేల్పుల రవీందర్, గాంధీనగర్ సర్పంచ్ తులసమ్మ, ఎంపీటీసీ గోపీశర్మ, శ్రీనివాస్, ఏఈఓ క్రిస్టొలైట్, తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో కమలాపూర్ సొసైటీ, ఐటీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ మచ్చ అనసూర్య ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వంగ లక్ష్మీ, తిప్పర్తి సాంబశివరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సూదాటి వెంకటేశ్వర్‌రావు, సీఈఓ చోటేమియా, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గణపతిరెడ్డి, సెంటర్ ఇన్‌చార్జ్ పెండ్యాల మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కోడారి స్వప్న, వార్డు సభ్యుడు బాషామియా, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరసన



ఆత్మకూరు : నిరసన తెలుపుతున్న కార్యదర్శులు



దామెర : నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

ఆత్మకూరు : తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని 16 గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పల్లెల్లో అనేక రకాల విధులను నిర్వర్తిస్తున్న తమపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని నినాదాలు చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యాదగిరి, రాజేందర్ పాల్గొన్నారు.

దామెర : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఇంజపెల్లి నరేష్, వేణుమాధవ్, సరళ, అన్నపూర్ణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సుకన్య, పద్మ, అమిత, సిరివెన్నెల, మణిదీప్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ పోల్‌కు టాటా ఏస్ ఢీ

ఐనవోలు : టాటా ఏస్ వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి విద్యుత్ పోల్‌ను ఢీకొట్టిన ఘటన మండలంలోని పంథిని గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం పంథిని గ్రామానికి చేరుకున్న క్రమంలో వాహనం అదుపుతప్పి విద్యుత్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం ధ్వంసం కాగా ఎవరికీ గాయాలు కూడా కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.